

అంగన్‌వాడీలకు.. మహర్దశ



మూసాపేటలో రంగులు వేసిన అంగన్‌వాడీ కేంద్రం

- పూర్వ ప్రాథమిక పాఠశాలగా పేరు మార్పు
- నూతన విద్యా విధానం పాలసీ ఏర్పాటు
- టీచర్లకు పూర్తయిన శిక్షణ
- పిల్లలకు అందించనున్న యూనిఫామ్స్
- సీఎం చేతుల మీదుగా త్వరలో ప్రారంభానికి సన్నాహాలు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఆగస్టు 10: అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. వాటి రూపు రేఖలు మారనున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలుగా ఉన్న వాటి పేరును పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా మార్చనున్నారు. కేంద్రాలకు ఆకర్షణీయంగా రంగులు వేయడంతో పాటు అందులో చదివే విద్యార్థులకు ఇకపై ఏకరూప దుస్తులు ఇవ్వనున్నారు. విద్యావిధానంలో కూడా కొత్త పాలసీకి శ్రీకారం చుట్టారు. పూర్వ ప్రాథమిక విద్య విధానంలో మార్పులు చేయడంతో పాటు ప్రత్యేక సిలబస్‌ను రూపొందించారు. అందుకోసం అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మొత్తంగా అంగన్‌వాడీ విద్యలో విప్లవాత్మకమైన మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఏకరూప దుస్తులు అందజేత

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 51,020 మంది పిల్లలు చదువుకుంటున్నారు. మొత్తం కేంద్రాలు 1,185కి గాను ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఉన్నవి, స్వంత భవనాలు ఉన్నవి 97 ఉన్నాయి. ముందుగా వాటిని ఎంపిక చేసి, అందులో చదివే 7,774 మంది పిల్లలకు ఏకరూప దుస్తులు పంపిణీ చేయనున్నారు. బాలికలకు స్కర్టు, బాలురకు షర్టు, నిక్కర్ ఇవ్వనున్నారు.

నూతన విద్యావిధానం

అంగన్‌వాడీ కేంద్రాలలో ఇదివరకు అక్షరాలు నేర్పించి, ఎక్కువగా ఆటలు ఆడించేవారు. కొత్తగా పూర్వ ప్రాథమిక విద్యా పాలసీని రూపొందించారు. న్యూట్రీషియన్, ప్లే స్కూల్, కరిక్యులమ్ పాఠ్యాంశాలు, ప్రాథమిక బాల్యం సంరక్షణ గురించి బోధించనున్నారు. విద్యను అందరికీ అందించే లక్ష్యంతో ఈ పాలసీని రూపొందించారు. ప్రతీ మూడు నెలలకోసారి సిలబస్‌ను రూపొందించి నాణ్యమైన ప్రాథమిక విద్యను పిల్లలకు అందించనున్నారు.

పేరు మార్పు...

మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 1,185 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మూడు నుంచి ఐదేళ్ల వయస్సున్న పిల్లలను ఈ కేంద్రాల్లో చేర్పించి, విద్యను అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పేరును పూర్వ ప్రాథమిక పాఠశాలల మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా బోర్డులను తయారు చేయించారు.

ఆకర్షణీయంగా అంగన్‌వాడీ కేంద్రాలు

అంగన్‌వాడీ కేంద్రాల రూపు రేఖలు మారనున్నాయి. పాత భవనాలకు రంగులు వేసి, ఆకర్షణీయంగా మారనున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 20 కేంద్రాలకు రంగులు వేస్తున్నారు. గోడలపై పిల్లలను ఆకర్షించేలా బొమ్మలు వేస్తున్నారు. ప్రైవేటు నర్సరీ పాఠశాలల మాదిరిగా తయారు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో దాతలు ముందుకొస్తే మిగతా వాటికి కూడా రంగులు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.


అందించనున్న యూనిఫామ్స్



అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాల పేరుతో ఏర్పాటు చేయనున్న బోర్డులు

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ..

పూర్వ ప్రాథమిక విద్యా విధానం పాలసీలో భాగంగా జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముందుగా జిల్లా కోఆర్డినేటర్, మరో 10 మందితో ఒక గ్రూపును తయారు చేసి హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. వారి ద్వారా జిల్లాలోని 1150 మంది అంగన్‌వాడీ టీచర్లకు గత జూన్ 15 నుంచి జూలై 13 వరకు శిక్షణ ఇప్పించారు. ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకొని నూతన విద్యా విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.



త్వరలో ప్రారంభం

అంగన్‌వాడీ కేంద్రాలపై ఇది వరకు కొంత చిన్నచూపు ఉండేది. కలెక్టర్ విజయేందిర బోయి సహకారంతో కేంద్రాలకు మహర్దశ రానుంది. కలెక్టర్ ప్రభుత్వంతో మాట్లాడి తమకు బడ్జెట్ కూడా కేటాయించారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల పనులు పూర్తయ్యాయి. త్వరలో సీఎం చేతుల మీదుగా రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తేదీలు ఇంకా ఖరారు కాలేదు. మేము మాత్రం ప్రారంభానికి అన్ని సిద్ధం చేసి పెట్టుకున్నాం.

- జరీనా బేగం, జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి

ప్యానల్ బోర్డు రాక

- మార్కండేయ లిఫ్ట్ ద్వారా ఎత్తిపోయనున్న నీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు
- గత ఎన్నికల ముందు అద్దె ప్యానల్ బోర్డుతో మోటార్ల ప్రారంభం
- పర్మినెంట్ ప్యానల్ బోర్డు తెప్పించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ
- ఈనెల 15 లోపు నీటి పంపింగ్‌కు ఏర్పాట్లు


లారీలో వచ్చిన ప్యానల్ బోర్డు

బిజినేపల్లి, ఆగస్టు 10: ప్యానల్ బోర్డు రావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం శాయిన్‌పల్లి గ్రామ సమీపంలోని మార్కండేయ లిఫ్ట్ ద్వారా నీటిని ఎత్తిపోయనున్నారు. కేఎల్ఐ కాల్వ ద్వారా 15 రోజులుగా నీరు పారుతున్నా.. ప్యానల్ బోర్డు లేక పోవడంతో మార్కండేయ లిఫ్ట్ పని చేయడం లేదు. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే సంబంధిత గుత్తేదారులను పిలిపించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఓట్ల కోసం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అద్దె ప్యానల్ బోర్డు తెప్పించి మోటార్లు ఆన్ చేశాడే తప్ప రైతుల మీద ప్రేమతో కాదని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ విమర్శించారు. వెంటనే ప్యానల్ బోర్డు తెచ్చి, రైతులకు నీళ్లు ఇవ్వాలని గుత్తేదారులను వారు ఆదేశించారు. ప్యానల్ బోర్డులు శనివారం రావడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 15 లోపు ప్యానల్ బోర్డు బిగించి, మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తామని గుత్తేదారులు తెలిపారు.

ఐదు గ్రామాలు, 15 తండాలకు లబ్ధి


మార్కండేయ ఎత్తిపోతల పథకం

మార్కండేయ లిఫ్ట్ ప్రారంభమైతే బిజినేపల్లి మండలంలోని మమ్మాయిపల్లి, శాయిన్‌పల్లి, గంగారం, లట్టుపల్లి, పోలేపల్లి గ్రామాలతో పాటు 15 తండాలకు తాగు, సాగునీటి అవసరాలు తీరుతాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మార్కండేయ లిఫ్ట్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అర టీఎంసీ నీటిని ఎత్తిపోసే ఈ పథకానికి గత ప్రభుత్వం రూ.77 కోట్ల నిధులు మంజూరు చేసింది. మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. పనులు పూర్తి చేయకుండానే.. 2023 నవంబరులో అసెంబ్లీ ఎన్నికల ముందు మోటార్లు ఆన్ చేశారు. ఆరు నెలల్లో పనులు చేస్తానని చెప్పినా.. నత్తనడకన పనులు సాగడంతో ఇప్పటికీ పూర్తి కాలేదు.

సంతోషంగా ఉంది

ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి కృషితోనే మార్కండేయ లిఫ్ట్ మోటార్లు ప్రారంభించేందుకు ప్యానల్ బోర్డు తేవడం సంతోషంగా ఉంది. కేఎల్ఐ కాలువ ద్వారా 15 రోజులుగా నీళ్లు పారుతున్నా మార్కండేయ లిఫ్ట్ మోటర్ల ద్వారా నీటి పంపింగ్ ప్రారంభించ లేదు. ఈసారి కూడా పొలాలు బీడు పెట్టుకోవాల్సి వస్తుందని బాధపడ్డాం. ఎట్టకేలకు ప్యానల్ బోర్డు రావడంతో నీటిపై రైతుల్లో ఆశలు చిగురించాయి.

- మస్కూరి అవంతి, మాజీ సర్పంచ్, శాయిన్‌పల్లి


చుట్టూ కొండలు, అడవితో కనువిందు చేస్తున్న సోమశిల



సోమశిల-సిద్దేశ్వరం కొండల మధ్య పారుతున్న కృష్ణానది

కృష్ణమ్మ సోయగాలు..

ప్రకృతి అందాలకు నెలవైన సోమశిల పర్యాటకులను ఆకర్షిస్తోంది. చుట్టూ నది ఉండి.. మధ్యలో ద్వీపంలా కనిపిస్తూ విశేషంగా ఆకట్టుకుంటోంది. వరద జలాల రాకతో కృష్ణానది సోయగాలు కనువిందు చేస్తున్నాయి. పర్యాటకులు లాంచీలో నదిపై విహరిస్తూ.. ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమశిల-సిద్దేశ్వరం కొండల మధ్య పారుతున్న కృష్ణానదిని చూసి పులకించి పోతున్నారు. ఫొటోలు, సెల్ఫీలు దిగుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాటేజీలలో ఉంటూ, ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. చేపల వంటకాలను ఆరగిస్తున్నారు.


- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్స్, మహబూబ్‌నగర్/వనపర్తి


లాంచీలో నదిపై విహరిస్తున్న పర్యాటకులు


లాంచీలోంచి నది అందాలను చూస్తున్న పర్యాటకులు


ఫొటోలు దిగుతున్న పర్యాటకులు


చుట్టూ నీటితో ద్వీపంలా కనిపిస్తున్న సోమశిల


నదిలో పుష్కర ఘాట్ల వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు


నిండుకుండలా కృష్ణానది

90 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

- వరద కారణంగా దిగువ కేంద్రంలో ఉత్పత్తి నిలిపివేత


దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు, ఆగస్టు 10: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి 90 మిలియన్ యూనిట్లకు చేరుకుందని ప్రాజెక్టు ఎస్ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. గడిచిన 24 గంటల్లో ఎగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 2.254 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి కొనసాగగా, ఇప్పటి వరకు 57.939 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో 15 రోజుల నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపేశామని చెప్పారు. ఇక్కడ ఇప్పటి వరకు 32.995 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి మాత్రమే కొనసాగిందని తెలిపారు. వరద తగ్గుముఖం పడితే దిగువ జూరాలలో కూడా ఆరు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగించే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

తండ్రిని చంపిన తనయుడు


సుల్తాన్ (ఫైల్)

తెలకపల్లి, ఆగస్టు 10: మద్యం మత్తులో జులాయిగా తిరుగుతూ కన్న తండ్రిని అతి కిరాతకంగా కొడుకు హత్య చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ బి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గట్టునెల్లికుదురుకు చెందిన బింగి మల్లేష్ చెడు వ్యసనాలతో పాటు మద్యానికి బానిసై ఎలాంటి బాధ్యత లేకుండా పని చేయకుండా గ్రామంలో జులాయిగా తిరుగుతుండేవాడు. శుక్రవారం రాత్రి కొడుకు మల్లేష్‌ను తండ్రి బింగి సుల్తాన్ (52) మద్యం మానాలని, బాధ్యతగా పని చేసుకోవాలని మందలించాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న మల్లేష్ ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న తండ్రి బింగి సుల్తాన్‌పై అతి కిరాతకంగా గొడ్డలితో ఎదపైన, గొంతుపైన నరికి చంపాడు. మృతుని భార్య బింగి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ హత్యతో గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య


నాగశ్రీ(ఫైల్)

మహబూబ్‌నగర్, ఆగస్టు 10: ఉరి వేసుకొని ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. మృతురాలి తండ్రి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్‌కు చెందిన అబ్బు నరేందర్(26) ఐదేళ్ల క్రితం మహబూబ్‌నగర్‌కు వచ్చి హిజ్రాగా మారాడు. ఝాన్సీనగర్‌లో నివాసం ఉంటోంది. నాగశ్రీ పేరుతో భిక్షాటన చేస్తూ, జీవనం సాగిస్తోంది. ఏడాది క్రితం పాత పాలమూరుకు చెందిన రమేశ్‌ను పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. శనివారం తెల్లవారుజామున రెండు గంటలకు రమేశ్ లక్ష్మయ్యకు ఫోన్ చేసి, నాగశ్రీ ఉరేసుకుని చనిపోయినట్లు చెప్పాడు. లక్ష్మయ్యతో పాటు కుటుంబ సభ్యులు ఆస్పత్రిలోని మార్చురీకి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. నాగశ్రీ మృతికి రమేశ్‌పై అనుమానాలున్నాయని లక్ష్మయ్య టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆంధ్రజ్యోతి
వాక్ ఇన్ ఇంటర్వ్యూ
ఆంధ్రజ్యోతి దినపత్రిక మహబూబ్‌నగర్ జిల్లా డెస్క్‌లో పనిచేయడానికి అనుభవం కలిగిన జర్నలిస్టులు, గ్రాఫిక్ డిజైనర్లు కావాలి

జర్నలిస్టులు
- డిగ్రీ పాసై ఉండాలి. వయస్సు 50 సంవత్సరాల లోపు ఉండాలి.
- తెలుగు భాషపై, వర్తమాన వ్యవహారాలపై మంచి పట్టు ఉండాలి.
- ఇంగ్లీషు అర్థం చేసుకోగలిగి ఉండాలి.
- ఏదైనా ప్రముఖ పత్రిక జిల్లా డెస్క్‌లో కనీసం ఏడేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి.
- క్వార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పేజీ లేఅవుట్ చేయగలిగి ఉండడం అదనపు అర్హత.
- అనుభవం, అర్హతల ప్రాతిపదికన వేతనం ఉంటుంది.

గ్రాఫిక్ డిజైనర్లు
- ఇంటర్/డిగ్రీ పాసై ఉండాలి. వయస్సు 45 సంవత్సరాల లోపు ఉండాలి.
- తెలుగు భాషపై కొంత పట్టు ఉండాలి.
- ఏదైనా ప్రముఖ పత్రిక జిల్లా డెస్క్‌లో కనీసం ఐదేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి.
- తెలుగు టైపింగ్, క్వార్క్ ఎక్స్‌ప్రెస్, అడోబ్ ఫొటోషాప్‌లో నైపుణ్యం ఉండాలి.
- అనుభవం, అర్హతల ప్రాతిపదికన వేతనం ఉంటుంది.

మీ ఫొటో, పూర్తి బయోడేటా, గతానుభవం తాలూకు వివరాలతో హాజరు కండి
వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీ 12.08.2024 సమయం ఉదయం 10.00 గంటలకు
వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 9985410678
చిరునామా: ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, తిరుమల హిల్స్, అప్పన్నపల్లి, మహబూబ్‌నగర్

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

మా చిత్రంలో నటించే అవకాశం
★ [illegible] 19న రామానాయుడు స్టూడియోలో షూటింగ్ ప్రారంభం. అన్ని వయసుల కొత్త వారికి యాక్టింగ్ ఫ్రీగా నేర్పిస్తున్నాం. మా సినిమాలో అవకాశం ఇస్తున్నాం. [illegible] ఫోటోలు మా వాట్సాప్ నెం.7981403355కు పంపండి. ఫిలింనగర్ Hyd. [illegible] AJH-002567

PROPERTY FOR SALE
★ "House for Sale" East Facing 180yd 2BHK at Jadcherla M: 9886154400
AJH-0609

ANDHRA JYOTHI CLASSIFIEDS
3+1 Scheme
ప్రతి 4లైన్లకు 200/- రూ॥
ప్రతి అదనపు లైను 45/- రూ॥
9985411175
9550413644
ఆంధ్రజ్యోతి
ఆఫీస్: తిరుమలహిల్స్, మయూరి నర్సరీ, గ్రా॥ అప్పన్నపల్లి, మహబూబ్‌నగర్

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, దట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

చోరీ కేసుల్లో
నిందితుల రిమాండ్

నారాయణపేట టౌన్, ఆగస్టు 10 : నారాయణ పేట జిల్లా కేంద్రంతో పాటు పళ్లవీధి, ధన్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనాల కేసులను చేధించినట్లు డీఎస్పీ ఎన్.లింగయ్య తెలిపారు. నారాయణపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన కేసు వివరాలను వెల్లడించారు. నారాయణపేట శాసన్‌పల్లి రోడ్ మార్గంలో ఉన్న భారత్‌గ్యాస్ ఏజెన్సీలో ఈనెల ఎనిమిదిన రాత్రి 25 గ్యాస్ సిలిండర్లను దొంగలించిన వ్యక్తి గాంధీనగర్‌కు చెందిన నగిరి ఆనంద్‌గా గుర్తించినట్లు తెలిపారు. అలాగే నెల రోజుల క్రితం నారా యణపేట పళ్ల వీధిలో ఇంట్లో వ్యక్తుల ఆరోగ్యం బాగుచేస్తానని మాయమాటలు చెప్పి పూజలు చేసి మోసపూరితంగా ఇత్తడి శివుని విగ్రహంతో పాటు మరికొన్ని వస్తువులను తీసుకొని మోసం చేసిన ఘటనపై గతంలో కేసు నమోదు కాగా జిల్లా కేంద్రంలోని బారంబావి కుంటకు చెందిన గజ్జెలి నరేష్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. ఈయన నుంచి రూ.40 వేల విలువ చేసే విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే నారాయణపేట మండలం బైరంకొండ గ్రామానికి చెందిన చాపలి విజయలక్ష్మీ ఇంట్లో ఈనెల ఏడో తేదీన చోరీ జరిగిందని ఈ చోరీకి పాల్పడింది నారాయణపేట మండలం జాజాపూర్ గ్రా మానికి చెందిన మన్నె వెంకటేష్‌గా గుర్తించి చోరీ వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసు చేధనలో కృషిచేసిన పోలీస్ బృందం నారాయణ, లింగమూర్తి, ఆంజనేయులు, రాములు, యాదయ్య, మల్లేష్, రాజుగౌడ్‌లను డీఎస్పీ అభినందించి, నగదు రివార్డును అందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎన్.లింగయ్య

విషజ్వరాల బారిన మాడాపూర్ గ్రామస్థులు

- ప్రతీ ఇంట్లో వ్యాధిగ్రస్తులు
- ఆసుపత్రుల బాట పడుతున్న జనం

లింగాల, ఆగస్టు 10 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం సురాపూర్ గ్రామ పంచాయతీలోని మాడాపూర్ గ్రామంలో విష జ్వరాలతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. గ్రామంలోని ఏ ఇంట్లో చూసినా వ్యాధి సోకిన వారు కన్పిస్తుండడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం జ్వరంతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులను 108లో లింగాల పీహెచ్‌సీకి తరలించారు. గ్రామస్థులు మాట్లాడుతూ గత మొహర్రం నుంచి తాము రోగాలతో అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మొత్తం 120 ఇళ్లల్లో 600 మంది జనాభా ఉన్నామని తెలిపారు. గ్రామంలో దోమల బెడద ఎక్కువైందని, దాంతో వ్యాధులు సోకడంపై ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. జ్వరాల బారిన పడిన చిన్నారులను నీలోఫర్ ఆసుపత్రికి తరలించిన ఘటనలు ఉన్నాయన్నారు.



చికిత్స కోసం అంబులెన్స్‌లో వెళ్తున్న రోగులు



తమ ఇద్దరు పిల్లలకు చికిత్స చేయించుకొని ఇంటికి తీసుకొస్తున్న తల్లిదండ్రులు

వ్యాధులతో ఇబ్బంది పడుతున్నాం..



గ్రామంలో కొన్నిరోజులుగా రోగాలతో ఇబ్బందులు పడుతున్నాం. ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకున్నప్పటికీ నయం కావడం లేదు. గ్రామంలో దోమల నివారణకు తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి.

- శ్రీరాములు


పిల్లలతో పాటు, అత్తమామలకు జ్వరాలు వస్తున్నాయి..





తన ఇద్దరు పిల్లలతో పాటు, అత్తమామ జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రతీరోజు అందరం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాం. అయినప్పటికీ నయం కావడం లేదు. గ్రామంలో తక్షణమే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి.

- జహంగీర్‌బీ

















సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

- ఎమ్మెల్యే వంశీకృష్ణ
- బుడ్డతండాలో ఘనంగా తీజ్ ఉత్సవాలు



గిరిజన సంప్రదాయ తలపాగాతో ఎమ్మెల్యే

అచ్చంపేట, ఆగస్టు 10 : గిరిజనులు తొమ్మిదిరోజుల పాటు భక్తిశ్రద్ధలతో జరుపుకునే తీజ్ ఉత్సవాల చివరి రోజైన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బుడ్డతండాలో ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులతో గిరిజన యువతులు తీజ్ బుట్టలను ఎత్తుకొని నిమజ్జనానికి వెళ్లారు. ఉత్సవ నాయకుల ఆధ్వర్యంలో గిరిజనులు వివిధ వేషధారణలో ఉత్సవాలకు హాజరై డప్పు నృత్యాల మధ్య వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరయ్యారు. గిరిజన నాయకులు ఆయనకు సంప్రదాయ తలపాగా చుట్టి గవ్వలతో తయారుచేసిన దండను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందరినీ ఒక చోటకు చేర్చే ఉత్సవాలను నిర్వహించడం వల్ల ఐక్యత పెరుగుతుందన్నారు. తీజ్ ఉత్సవాల సందర్భంగా బంధుమిత్రులతో తండా కళకళలాడింది.

కొంగొత్తగా కొన్నూరు

- గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రులు
- మన ఊరు, మన బడికి పారిశ్రామిక వేత్త సహకారం
- గ్రామాభివృద్ధిలో కీలకంగా శరత్‌రెడ్డి

మదనాపురం, ఆగస్టు 10 : వనపర్తి జిల్లా కొన్నూరు కొంగొత్తగా రూపుదిద్దుకుంటోంది. గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ఆ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త శరత్‌రెడ్డి పూనుకున్నారు. ముఖ్యంగా గ్రామంలోని పాఠశాలను పునర్నిర్మించేందుకు గాను ప్రభుత్వం కేటాయించిన రూ.65 లక్షలు కాకుండా శరత్‌రెడ్డి సొంతంగా తన నిధులను వెచ్చిస్తున్నారు.



కొన్నూరులో ప్రారంభం కానున్న ప్రభుత్వ పాఠశాల

ఊరికి సేవ చేయడంలోనే సంతృప్తి



మనం ఎంత సంపాదించినా అది వేరే వారికి ఉపయోగపడనప్పుడు అదంతా వృథానే. గ్రామంలో విద్యార్థులు బాగా చదువుకొని ఎదగాలన్నదే నా ఆశయం. అది నెరవేరాలంటే వసతులు అవసరం. అదేవిధంగా గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రజలకు అవసరమయ్యే భవనాలు ఉంటే అధికారులు వస్తారు. దీని కోసం నా వంతు సహాయం చేస్తున్నా.

- శరత్‌రెడ్డి, కొన్నూరు

దాదాపు రూ.కోటి 15 లక్షలు వెచ్చించి పాఠశాలలో పది నూతన తరగతులతో పాటు ఒక మీటింగ్ హాల్, డైనింగ్ హాల్, పది బాత్‌రూంలు ఉండే విధంగా నిర్మాణాన్ని పూర్తి చేయించారు. అంతేకాకుండా గ్రామంలోని హెల్త్ సబ్‌సెంటర్‌కు అదనంగా రూ.ఐదు లక్షలు, పంచాయతీ భవనానికి రూ.రెండు, వెటర్నరీ సెంటర్‌కు రూ.ఎనిమిది లక్షలు కేటాయించి పూర్తిగా నిర్మాణం చేశారు. పూర్తయిన నిర్మాణాల ప్రారంభోత్సవానికి ఆదివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ్మా, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డిలు రానున్నారు.

ప్రమాదం కేసును ఛేదించడంలో జాప్యమెందుకు?

- పక్కదారి పట్టిన మార్కెట్‌యార్డు గోదాం అగ్నిప్రమాదం కేసు
- రూ.10 కోట్ల ప్రజాధనం అగ్నికి ఆహుతి
- పట్టించుకోని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు

పెబ్బేరు, ఆగస్టు 10 : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ అగ్ని ప్రమాదం కేసును ఛేదించడంలో పోలీసులు ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ఏప్రిల్ ఒకటో తేదీన వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని గోదాంలో భారీ అగ్ని ప్రమాదం జరిగి రూ.10 కోట్ల ప్రజాధనం అగ్నికి ఆహుతి అయింది. కానీ నేటికీ ఆ అగ్ని ప్రమాదానికి గల కారణాలు పోలీసులు కానీ, వ్యవసాయ శాఖ అధికారులు గానీ, ప్రత్యేక విచారణ అధికారుల బృందం కానీ కనుక్కోలేకపోయింది. గోదాంలో 12 లక్షల 80 వేల గన్నీ బ్యాగులు, దాదాపు రూ.40 వేల వరి ధాన్యం దగ్ధమైంది. గోదాం భవనం కూలిపోయింది. పదిరోజుల పాటు మండుతూనే గన్నీ బ్యాగులు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది పదిరోజుల పాటు శ్రమించింది. నాలుగు మాసాల



పెబ్బేరులోని గోదాంలో అగ్ని ప్రమాదం (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

పదిరోజులు గడుస్తున్నా ఇంతవరకు అగ్ని ప్రమాదానికి గల కారణాలను వెల్లడించలేదు. మారిన టెక్నాలజీ కాలంలో కూడా నిందితులను గుర్తించలేకపోయారు. ప్రభుత్వ ఆస్తులను దగ్ధం చేసిన వారిని పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యాయరని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారకులైన వారిని గుర్తించి శిక్ష పడేలా చేస్తామని ప్రకటించారు. కానీ ఇప్పుడు ఆ మాటే ఎత్తడం లేదు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విచారణ బృందం పర్యటించినప్పటికీ విషయాలు బయటికి రాలేదు. రాజకీయ నాయకుల ప్రమేయంతోనే కేసును పోలీసులు నీరుగారుస్తున్నారని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

నివేదికను డీఎస్పీ కార్యాలయానికి పంపాం : సీఐ రాంబాబు

అగ్ని ప్రమాద కేసు విచారణ పూర్తిచేసి నివేదికను వనపర్తి డీఎస్పీ కార్యాలయంలో సమర్పించాం. డీఎస్పీ నుంచి ఎస్పీ, కలెక్టర్‌కు నివేదిక వెళ్తుంది.

కవిత్వం సామాజిక చైతన్యాన్ని పెంచుతుంది

- ప్రముఖ కవి, విమర్శకులు సీతారాం

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 10 : కవిత్వం అనేది సామాజిక చైతన్యం, బాధ్యతను పెంచుతుందని ప్రముఖ కవి, విమర్శకులు సీతారాం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కవిత్వ నిర్మాణంపై రెండురోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. నెలపొడుపు సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి పి.వహీద్‌ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ప్రముఖ కవి సీతారం ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. కవిత్వం సమాజంలో మార్పును తెస్తుందన్నారు. ఉన్మాదాలు, ఉత్పాతాలు, దోపిడీ నుంచి మూఢాచారాల నుంచి చైతన్యం చేసేదే కవిత్వమని పేర్కొన్నారు. శ్రామిక, సామాజిక చైతన్యంలో కవిత్వం ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ఆదివారం రెండో రోజు నిర్వహించే వర్క్‌షాప్‌కు కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, కేంద్ర సైట్ అకాడమీ యువ పురస్కార



కవి, విమర్శకులు సీతారాంను సన్మానిస్తున్న నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక సభ్యులు

గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, గౌరవ అధ్యక్షుడు కందికొండ మోహన్, కవులు కల్వకోలు మద్దిలేటి, ముచ్చర్ల దినకర్, నీరటి బాలీశ్వర్, నాగవరం బాల్‌రాం, కోట్ల గౌతమ్, జయప్రకాష్, విజయ్‌కాంత్, గడ్డంపల్లి భూపాల్‌రెడ్డి, గౌస్‌పాష, దేవదానం, గఫార్, చిక్కొండ్ర రవి తదితరులున్నారు.

ప్రేమ పేరుతో చనువు

- పెళ్లి మాటెత్తితే దాడి, బెదిరింపులు
- యువకుడిపై పోలీసులకు గిరిజన యువతి ఫిర్యాదు

నవాబ్‌పేట, ఆగస్టు 10 : తనను ప్రేమ పేరుతో లోబరచుకొని గర్భం దాల్చగా అబార్షన్ చేయించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి తీరా మోసం చేశాడని ఆరోపిస్తు ఓ గిరిజన యువతి మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలంలోని ఓ తండాకు చెందిన యువతి (22) హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో చదువుకుంటోంది. ఈమెకు నవాబ్‌పేటకు చెందిన షేక్ ముస్తఫా అనే యువకుడు కొంతకాలంగా ప్రేమ పేరుతో చనువుగా ఉంటూ ఆమెను లోబర్చుకుని గర్భవతిని చేశాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ ఆసుపత్రిలో గతేడాది సెప్టెంబర్ నెలలో అబార్షన్ చేయించాడు. పెళ్లి చేసుకోవాలంటే మతం అడ్డు వస్తుందని చెప్పి దాడి చేసి, బెదిరింపులకు పాల్పడ్డాడు. తనను మోసం చేసిన షేక్ ముస్తఫా, అతని కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి



ఉప్పరి పరమేశు (ఫైల్)

వడ్డేపల్లి, ఆగస్టు 10 : ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి చెందిన సంఘటన కర్నూలు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం బుడమర్సు గ్రామానికి చెందిన ఉప్పరి పరమేశు(30) గ్రామం నుంచి కర్నూలుకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

అలంపూరు, ఆగస్టు 10 : అత్తమామ వేధింపులు తాళలేక గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరు మండలం లింగనవాయి గ్రామానికి చెందిన మాధవి(27) అత్తమామ వేధింపులతో గతవారం గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. చికిత్స సమయంలో మాధవి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు..

ఉప్పునుంతల, ఆగస్టు 10 : విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం అయ్యవారిపల్లితండాలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రామవత్‌సత్రాం శనివారం ఉదయం తన వ్యవసాయ పొలంలో ఉన్న పాడి ఆవుకు ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి మృతి చెందింది. ఆవు విలువ రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ ఊరిళ కోరారు.

ఆర్టీసీ బస్సు, బొలెరో ఢీ

- బస్ డ్రైవర్‌కు గాయాలు

అచ్చంపేట టౌన్, ఆగస్టు 10 : ఆర్టీసీ బస్సు, బొలెరో ఢీకొని ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలైన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ సమీపంలోని వైజంక్షన్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట డిపోకు చెందిన బస్సు అచ్చంపేట నుంచి దేవరకొండకు వెళ్తుండగా పట్టణ సమీపంలోని వైజంక్షన్‌లో చారకొండ మండలానికి చెందిన బొలెరో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో బొలెరో నుజ్జునుజ్జయ్యింది. బొలెరో డ్రైవర్ కొప్పెర మహేష్‌కు స్వల్ప గాయాలు కాగా, బస్ డ్రైవర్ శేఖర్ కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు 108లో ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

- భూమి రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపం

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 10 : తన భూమిని మాయమాటలతో రిజిస్ట్రేషన్ చేసుకుని సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన రైతు కత్తె మల్లేష్ గ్రామ చివరన చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని వనపట్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... వనపట్ల గ్రామానికి చెందిన కత్తె రాములు, కత్తె మల్లేష్, కత్తె జ్యోతి ముగ్గురు ఒకే కుటుంబ సభ్యులు. వీరి పేరున గ్రామ శివారులో 135 సర్వే నెంబరులో నాలుగు ఎకరాల 38 గుంటల భూమి ఉండడంతో అట్టి భూమిని వనపట్ల గ్రామ మాజీ సర్పంచ్ మన్యపురెడ్డి, కుమ్మెర గ్రామ మాజీ సర్పంచ్ భర్త తిరుపతిరెడ్డి, నర్సాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ భర్త రామకృష్ణారెడ్డిలు తమ భూమిని కొనుగోలు చేసేందుకు ఒక ఎకరాకు రూ.కోటి 36 లక్షలుగా ధర ఖరారు చేసుకుని రూ.రెండు కోట్ల 32 లక్షలు నగదు చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నారు. మిగతా డబ్బులు సంవత్సరంలోపల ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుంటామని ఒప్పందం చేసుకున్నారు. డీటీసీపీ అప్రూవల్ తెచ్చుకుని పది శాతం గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలని వారికి మాయమాటలు చెప్పి మొత్తం భూమిని మాజీ సర్పంచ్ మన్యపురెడ్డి సాక్షిగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విషయం రైతులకు తెలియకుండా మొత్తం భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయం తెలిసిన రైతులు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా ఎలాంటి న్యాయం జరగకపోవడంతో మనస్తాపానికి గురైన కత్తె మల్లేష్ గ్రామ చివరన చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన గ్రామస్థులు అతన్ని చూసి కాపాడి జిల్లా ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. 48 గంటలు అబ్జర్వేషన్‌లో ఉండాలని సూచించారు. ఇంకా తనకు రావాల్సిన రూ.నాలుగు కోట్ల 41లక్షలు ఇప్పించాలని బాధిత కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు.



జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్లేష్

ఒరిగిన స్తంభంతో పొంచి ఉన్న ప్రమాదం


బిజినేపల్లి, ఆగస్టు 10 : నిత్యం వాహనాల రాకపోకలతో పాటు వ్యవసాయ పొలాలకు రైతులు తిరిగే ప్రధాన రహదారిపై ప్రమాదభరితంగా 33 కేవీ విద్యుత్ లైన్ స్తంభం సగానికి వాలి ఉండడంతో పెను ప్రమాదం జరిగే అవకాశం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిజినేపల్లి మండలం గంగారం - లట్టుపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో పోలేపల్లి తండా సమీపంలో ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ స్తంభం పదిరోజుల క్రితం గాలివానలకు ఒరిగింది. స్తంభం ప్రమాదభరితంగా ఒరిగిందని చుట్టుపక్కల ఉన్న రైతులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇప్పుడు, అప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్పా ఇప్పటివరకు ఒరిగిన స్తంభాన్ని సరి చేయకపోవడంతో ఎప్పుడు స్తంభం కింద పడి జరగరాని ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలో ఉన్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్యకాలంలోనే విద్యుత్ లైన్‌ను వేసేందుకు కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టర్ స్తంభాలు నాటేందుకు గుంతలు తక్కువ లోతు తీయడంతో పాటు, నాసిరకం విద్యుత్ స్తంభాలు, వైర్లు తీసుకొచ్చి ఆదరబాదరాగా పనులు చేశాడని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అంటున్నారు. వాలిన స్తంభంతో పాటు ఆ విద్యుత్ లైన్ అంతా కూడా తిరిగి నాణ్యతగా వేయించి ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాలని కోరుతున్నారు. అంతేకాకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా విద్యుత్ లైన్‌ను వేసిన సంబంధిత కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు, రికవరీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సబ్‌స్టేషన్‌కు వెళ్లే పెద్దలైన్ విద్యుత్ వైర్లు కావడంతో రోడ్డుపై స్తంభం పడి ప్రాణ నష్టం సంభవిస్తే బాధ్యత ఎవరిదని అధికారులను ప్రశ్నిస్తున్నారు.



లట్టుపల్లి నుంచి గంగారం వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదభరితంగా వాలిన 33 కేవీ విద్యుత్ లైన్ స్తంభం







తెలంగాణకు ఐటీ కంపెనీలు

- అమెరికా పర్యటనలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



అమెరికా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 10 : రానున్న రోజుల్లో తెలంగాణకు పెద్దఎత్తున ఐటీ కంపెనీలు రానున్నాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పలు కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. శుక్రవారం రాత్రి ఐటీ సర్వ్ అలయన్స్ సమావేశం సందర్భంగా 2400 ఐటీ కంపెనీల సంఘం ప్రజంటేషన్‌లో సీఎం రేవంత్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌తో కలిసి ఎమ్మెల్యే యెన్నం ఐటీ కంపెనీలు ఇచ్చిన ప్రజంటేషన్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని రానున్న రోజుల్లో ఫ్యూచర్ సిటీగా మార్చేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనేక మార్గాలను అన్వేషిస్తున్నారని వెల్లడించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుక్ హుస్సేన్



మాట్లాడుతున్న షేక్ ఫారుక్ హుస్సేన్

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 10 : ఉద్యోగులను నిర్లక్ష్యం చేయకుండా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుక్ హుస్సేన్ కోరారు. శనివారం షాసాబ్ గుట్టలో ఆ సంఘం కార్యాలయంలో సంఘం సభ్యులతో సమా వేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన ఎన్ని కల మేనిఫెస్టోలో అప్పటికే పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిం దన్నారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు అయినా ఏ ఒక్క సమస్యా పరిష్కరించక పోవడం భావ్యం కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తించి ఉద్యోగులు ఆర్థిక పరమైన సమ స్యలు తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇఫ్రత్‌అలీ, మహ్మద్ అయూబ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ వహీద్‌షా, కోశాధికారి మహ్మద్ రషీద్, నాయకులు ఖాజా నిజాముద్దీన్, షేక్ ఫరీద్, రహ్మాన్, యూసుఫ్ బిన్ నాసర్, వాహబ్, నాసిర్, షాహఆలం పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నాం

- మద్దికాన్ చెరువు నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేసిన నాయకులు



మద్దికాన్ చెరువు తూము ద్వారా నీటిని విడుదల చేస్తున్న మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు

భూత్పూర్, ఆగస్టు 10 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ కోసం కట్టుబడి ఉందని మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మద్దిగట్ల గ్రామ శివారులో ఉన్న మద్దికాన్ చెరువు నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఆయకట్టు రైతుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. కేఎల్ఐ కెనాల్ నుంచి మండలంలోని మద్దికాన్ చెరువు, వెల్కిచర్ల గ్రామ శివారులోని నాగులకుంట చెరువుకు నీరు పుష్కలంగా ప్రతీయేటా మూడు పంటలకు అందుతుందని మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెల్కిచర్ల, మద్దిగట్ల, కొత్తమొల్గర, పాతమొల్గర, కప్పెట తదితర గ్రామాల శివారులో ఉన్న చెరువులతో పాటు, మూసాపేట, అడ్డాకుల, మండలాల శివార్లో ఉన్న సుమారు 12 నుంచి 17 చెరువుల ద్వారా రైతులకు సాగు నీరు అందుతుందని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో రైతులకు మరిన్ని సంక్షేమ పథకాలు అందేలా ఎమ్మెల్యే జీఎంఆర్ ద్వారా కృషి చేస్తామని వారు రైతులకు భరోసానిచ్చారు. వెల్కిచర్ల, మద్దిగట్ల రైతులు పాల్గొన్నారు.

శ్రీరంగనాయకస్వామి గుట్టపై భక్తుల సందడి



శ్రీరంగనాయకస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

జడ్చర్ల, ఆగస్టు 10 : జడ్చర్ల మునిసిపాలిటీ పాతబజారు సమీపంలోని రంగనాయకస్వామిగుట్టపై భక్తులు సందడి చేస్తున్నారు. శ్రావణమాసం సందర్భంగా నెల రోజుల పాటు శ్రీరంగనాయకస్వామి దేవాలయంలో ఉత్సవాలను ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రావణ శనివారంతో పాటు రెండవ శనివారం సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకునేందుకు తరలివ చ్చారు. భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు కనీస సౌకర్యాలు, సదుపాయాలను ఏర్పాటు చేశారు.

ఆంజనేయస్వామికి అభిషేకం

చిన్నచింతకుంట, ఆగస్టు 10 : శ్రావణమాసం తొలి శనివారం సందర్భంగా మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామికి అభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామంలోని భక్తులు వారి ఇళ్లను శుభ్రపరుచుకు న్నారు. ఎంతో భక్తితో ప్రత్యేక భజనలతో గ్రామ సమీపం లోని ఆంజనేయస్వామి వారి బావినుంచి నీటిని గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణాల మధ్యన ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక భజనలు నిర్వహించారు.

ఘనంగా యూటీఎఫ్ 50వ ఆవిర్భావం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 10 : ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 50వ ఆవిర్భావ వేడుకలు శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో నాయకులు ఆర్.రామ్‌రెడ్డి, కిష్టయ్య సంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఏర్పడిన సంఘం యూటీఎఫ్ అని అన్నారు. ఉద్యమాల సారథి, ఉపాధ్యాయుల పెన్నిధి యూటీఎఫ్ అని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నామని, ఉద్యమాల ఎన్నో సమస్యలు పరిష్కరించుకున్నామని గుర్తు చేశారు. 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. ప్రభుత్వ బడులను రక్షించడం కోసం తమ వంతు బాధ్యతగా నిరంతర పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాందాస్ ఎస్.కిష్టయ్య, అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, నాయకులు బి.భాస్కర్, శ్రీనివాసులు, అజయ్, మన్యం, సుదర్శన్, జయంతి, శంకర్‌నాయక్, నరేష్, రమేష్, కిషన్ పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న జలపాతం





చిన్నచింతకుంట మండలం బండర్‌పల్లి గ్రామ సమీపంలోని రాయిచూరు-హైదరాబాద్ రహదారిలోని ఊకచెట్టువాగులో చెక్‌డ్యాం జలపాతం చూపరులను కనువిందు చేస్తున్నది. ఎగువన కురిసిన వర్షాలకు చెక్‌డ్యాంలోకి నీరు భారీగా చేరటంతో, చెక్‌డ్యాంమీది నుంచి మత్తడి దుంకుతోంది. దాంతో జలపాతం ఎంతో ఆకట్టు కుంటున్నది. పైన హైలెవల్ వంతెనపై వాహనాల రాకపోకలు, జరుగుతుంటాయి.దాంతో వాహనాల్లో వెళ్తున్న వారు జలపాతం చూసేందుకు వాహనాలు నిలిపిమరీ చూస్తున్నారు. ఇక ఆలయానికి వచ్చే భక్తులు కూడా చెక్‌డ్యాం వద్ద స్నానాలు ఆచరిస్తున్నారు.

- చిన్నచింతకుంట

మంత్రి జూపల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్



మంత్రి జూపల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్, ఆగస్టు 10 : రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదినం పురస్కరించుకుని మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రిని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజనుల పట్ల వివక్ష చూపుతున్న సర్కార్

- గిరిజన సేవా సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మణ్

పాలమూరు, ఆగస్టు 10 : కాంగ్రెస్ పార్టీ గిరిజనుల పట్ల వివక్ష చూపుతోందని గిరిజన సేవా సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మణ్ నాయక్ ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పదవుల, నామినేటెడ్ పోస్టుల్లో ఏ ఒక్కటికూడా గిరిజనులకు ఇవ్వకపోవటం దారుణమన్నారు. ముఖ్యంగా సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందన్నారు. మైదాన ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు ఐటీడీఏ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామని నేటికీ చేయలేదన్నారు. సీఎం సొంత జిల్లాలో గిరిజనులకు ఒక్క పదవి ఇవ్వకపోవటం దారుణమన్నారు. సమావేశంలో వి.కిషన్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాడుతాం

- సత్యాగ్రహ దీక్షలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్‌లో మాజీ మంత్రి చేస్తున్న దీక్షలో పాల్గొన్న మండల నాయకులు

హన్వాడ, ఆగస్టు 10 : సమగ్ర కుల, జన గణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధించే వరకు పోరాడతామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్‌లో శనివారం మంత్రి శ్రీనివాస్ గౌడ్ చేసిన సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా మండల నాయకులు పాల్గొన్నారు. బహుజన నాయకులు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ నరేందర్, మాజీ వైస్ ఎంపీపీ కొండ లక్ష్మయ్య, మాజీ సర్పంచులు చెన్నయ్య, వెంకన్న, లక్ష్మీనారాయణ, సొసైటీ చైర్మన్ వెంకటయ్య, నాయకులు రఘు, ఖాజగౌడ్, బాలరాజు పాల్గొని మద్దతు తెలిపి మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతీ ఒక్కరు దేశభక్తితో ఉండాలి

- జాతీయ జెండాల పంపిణీలో బీజేపీ నాయకులు



జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), ఆగస్టు 10 : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని 47వ వార్డు కొత్తగంజ్, హనుమాన్ నగర్ తదితర ప్రాంతాలలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాలను స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు. ఆ వార్డు బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జి దర్పల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో దేశభక్తి కలిగి ఉండాలని సూచించారు. హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 నుంచి 15 వరకు జాతీయ జెండాను ఎవరికి వారు తమ ఇళ్లపై ఎగరవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అచ్చుగట్ల అంజయ్య, నాయకులు, కార్యకర్తలు, బోయ శ్రీను, ఆవుల నర్సింహ, గౌలి బాబు, నరేష్, అంబుదాస్, వర్ధన్, బోడ రాజు, సురేష్, ఓం ప్రకాశ్, మహిళలు, యువత పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు దేశభక్తిని చాటాలి

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయులందరు వారి ఇళ్లపై జాతీయ జెండాను ఉంచి దేశ భక్తిని చాటాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం పాలమూరు పట్టణంలో తన స్వగృహంపై జాతీయ జెండాను ఉంచారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కందూర్ రమేశ్, గొడుగు ఆంజనేయులు, కొడంగల్ అసెంబ్లీ కో-కన్వీనర్ రాము, మహేష్, నారాయణ, శేఖర్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడి విగ్రహం శుభ్రం

జడ్చర్ల : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోదుడి విగ్రహాన్ని శుభ్రం చేశారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని నేతాజీచౌరస్తాలో ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని శుభ్రం చేశారు. నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతీ ఇంటి పైన జాతీయపతాకాన్ని ఎగురవేయాలని పట్టణ అధ్యక్షుడు నాగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీతారాంనాయక్, ముచ్చర్ల కృష్ణయ్య, బాలకృష్ణ, సామల నర్సిములు, వెంకట్, శ్రీనివాస్‌గౌడ్, మురళీ, అమర్‌నాథ్‌గౌడ్, చెవ్వ నాగరాజు, పిట్టల నరేశ్, జగదీశ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కళలను ఆదరించాలి

- సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్



భీష్మ నాటక ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 10 : జిల్లాలో కళాకారులకు కొదువలేదని సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక టౌన్ హాల్‌లో పల్లవి ఆర్ట్స్ ప్రొద్దుటూరు వారు, శ్రీ మిత్ర కళా మండలి వారు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాద్మి శివకుమార్, జిల్లా హౌజింగ్ పీడీ వైద్యం భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్చరల్ అకాడమీ వారు భీష్మ నాటక ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనను తిలకించేందుకు పెద్ద మొత్తంలో కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ జిల్లా కళకారులకు పుట్టినిల్లని అన్నారు. ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలని తెలిపారు. కళాకారులు అద్భుతమైన కళాప్రదర్శన కనబర్చారని అభినందించారు. ప్రదర్శనలో మయసభ దుర్యోధనుని పాత్ర, శ్రీ కృష్ణ రాయబారం, పడక సీను పాత్రలో కళాకారులు పలువురిని ఆకట్టుకున్నాయి. వంద మంది కళాకారులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు ఉమ్మింతాల మహేష్, కే. బాలస్వామి, తకళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

మన్యంకొండకు తరలి వచ్చిన భక్తులు



సామూహిక వ్రతం నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అర్చకులు

హబుబ్‌నగర్ రూరల్, ఆగస్టు 10 : మన్యంకొండ శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామివారికి శ్రావణ మాస శనివారం పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, సామూహిక వ్రతాలు నిర్వహించారు. శ్రావణ మాస శనివారం పర్వదినం సందర్భంగా స్వామివారికి భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వ్రతాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అర్చకుల వేదమంత్రాలతో వ్రతాలు నిర్వహించి, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామిని పల్లకి సేవలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కందూరులో బాధితున్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆల

అడ్డాకుల, ఆగస్టు 10 : గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న మండల పరిధిలోని కందూరుకు చెందిన ప్రభాకర్‌రెడ్డిని శనివారం ఆ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి సంపూర్ణ ఆరోగ్యవంతుడు కావాలని ఆల ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో అడ్డాకుల సింగిల్‌విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ సర్పంచు శ్రీకాంత్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మహిమూద్, రామలింగేశ్వరాలయం మాజీ చైర్మన్ రమేశ్‌గౌడ్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖాజాహోరి పాల్గొన్నారు

'పులిజాల శివశంకర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి'

పాలమూరు, ఆగస్టు 10 : మాజీ కేంద్రమంత్రి, దివంగత పులిజాల శివశంకర్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మున్నూరుకాపు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దుంకుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నూరుకాపు ముద్దుబిడ్డ శివశంకర్ పుట్టిన రోజున జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. బీసీ సమాజానికి రిజర్వేషన్లు కల్పించడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. మున్నూరుకాపు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యత్వం సెప్టెంబరు 30వ తేదీ వరకు పూర్తి చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బుక్కస్వామి, కె.శ్రీనివాసులు, సత్యనారాయణ, కె.పురుషోత్తం, పి.వెంకటయ్య, నర్సిరెడ్డి, జి.కృష్ణయ్య, రమేష్, శివానంద, చంద్రకాంత్, వెంకటయ్య, బి.సతీష్‌లు పాల్గొన్నారు.ల

నంచర్ల గురుకులను పరిశీలించిన ఎస్‌ఎఫ్ఐ నాయకులు

మహమ్మదాబాద్, ఆగస్టు 10 : మండల పరిధిలోని నంచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయి పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై శనివారం ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు నందు, శ్రీనాథ్ తదితరులు పరామర్శించారు. జరిగిన ఘటన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నెం.100ను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చూడాలన్నారు. ప్రతీ గురుకులంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా వైద్యసిబ్బంది ఊర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ గురుకులాన్ని ఎమ్మెల్యే, ఎంపీలు పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకోవాలని వారు కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.

బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకుందాం

- ఆందోళన కరపత్రం ఆవిష్కరణలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు



జడ్చర్ల మునిసిపల్ కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మునిసిపల్ కార్మికులు

పాలమూరు, ఆగస్టు 10 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి దేశాన్ని రక్షించుకుందామని ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆందోళన కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నయా ఉదారవాద సంస్కరణలను దూకుడుగా కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, కిల్లె గోపాల్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, వరద గాలెన్న, చంద్రకాంత్, ప్రవీణ్‌భాను ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలపై గాంధీ విగ్రహానికి వినతి

జడ్చర్ల : మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ దశల వారీగా చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో భాగంగా శనివారం గాంధీ విగ్రహానికి మున్సిపల్ కార్మికులు వినతిపత్రం అందచేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్మికులు కృష్ణ, మహేష్, కేశవులు, విద్యాసాగర్,చంద్రమౌళి, యాదయ్య, జంగయ్య, భారతి, లక్ష్మమ్మ, గణేష్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తికి సన్మానం



సుప్రీంకోర్టు న్యాయమూర్తిని సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాలమూరు, ఆగస్టు 10 : ఎస్సీలకు సమన్యాయం జరగాలంటే వర్గీకరణతోనే సాధ్యమని భావించి వర్గీకరణ చేయటంలో కీలకభూమిక పోషించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తిని శనివారం ఢిల్లీలో ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు. ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, న్యాయవాది కొమ్ము ప్రవీణ్‌కుమార్, పులిజాల గెలువయ్యలు కలిసిన వారిలో ఉన్నారు. రిజర్వేషన్లు పంపిణీతోనే మాదిగ, మాదిగ ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులలో ఒకరైన సిద్ధార్థ లూథ్ర అన్నారని తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ బృందానికి ఎమ్మార్పీఎస్ ప్రతినిదులు సన్మానించినట్లు తెలిపారు. డి.ఎస్ రాజు, శ్రీనివాస్, మోహన్, యాదగిరి పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ ఫలాలు అందించిన మహనీయుడు శివశంకర్



శివశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

పాలమూరు, ఆగస్టు 10 : సమాజంలో బీసీలకు రిజర్వేషన్ ఫలాలు అందించిన మహనీయుడు పి.శివశంకర్ అని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ కార్యాలయంలో దివంగత పి.శివశంర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. 1972తరువాత రిజర్వేషన్లు బీసీలకు అందటం శివశంకర్ కృషియే కారణమన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ స్థానాలు తప్ప మిగిలిన వాటిలో నిలబడి గెలిచినప్పుడే శివశంకర్‌కు ఘనమైన నివాళి అర్పించిన వారమవుతామన్నారు. వివిధ సంఘాల నాయకులు ప్రేమ్‌సాగర్, బుగ్గన్న, సారంగి లక్ష్మీకాంత్, దుర్గేష్, గంజి ఆంజనేయులు, మద్దూరి కృష్ణ, వెంకటేష్, సవారి సత్యం, పి.కేశవులు, జగదీష్ పాల్గొన్నారు.

కుక్కలు బాబోయ్ కుక్కలు

- మూడు నెలల్లో 100 మందికి పైగా కరిచిన కుక్కలు

హన్వాడ, ఆగస్టు 10 : పల్లెల్లో కుక్కల బెడద ఎక్కువైంది. మండలంలో గత నాలుగు నెలల్లో దాదాపుగా రెండు వందల మందికి కుక్కలు కరిచాయి. అధికారికంగా ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకు 30 మంది కుక్క కాటుకు గురై చికిత్స తీసుకుంటున్నారు. గత నెలలో టంకరలో ఓ చిన్నారి ఇంటి బయట ఆడుకుంటుండగా కుక్క కరిచింది. హన్వాడకు చెందిన చెందిన ఓ వృద్ధుడు ఇంటికి వెళుతుండగా ఎగబడి కరిచింది. మాదారం, మునిమోక్షం గ్రామాల్లో కుక్కల బెడదతో ప్రజలు రోడ్లపై తిరిగేందుకు ఇబ్బంది పడుతున్నారు. హన్వాడ, చిన్నదర్పల్లి గ్రామాల్లో బైక్‌లపై వెళుతున్న వాహన చోదకుల పైకి ఎగబడుతున్నాయి.



హన్వాడలో కుక్కల గుంపు

అంతేకాక గొర్రె పిల్లలను చంపి తింటున్నాయి. చిన్నచిన్న ఆవుదూడలను గాయపర్చుతున్నాయి. మండలంలో అధికారికంగా ఏప్రిల్ నెలలో 29, మేలో 37, జూన్‌లో 29, జూలైలో 32 మందిని కుక్కలు కరువగా వారు హన్వాడ ప్రాథమిక ఆసుపత్రిలో చికిత్స చేసుకుంటున్నారు. నాటు వైద్యం కూడా కొందరు చేసుకుంటున్నారు. ఈ నెల 5న హన్వాడకు వచ్చిన కలెక్టర్, పంచాయతీరాజ్ కమిషనర్‌ను కుక్కల సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరారు.

వ్యాక్సిన్ అందుబాటులో ఉంది

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటు వ్యాక్సిన్ ఉంది. ఈ సంవత్సరం ఎక్కువ మంది కుక్క కాటుకు గురై చికిత్సకు వస్తున్నారు. కుక్క కాటుతో వచ్చిన రోగులకు నాలుగు టీకాలు ఇస్తున్నాం.

- ప్రగతి, వైద్యురాలు

గొర్రె పిల్లలను కరిచి చంపుతున్నాయి

కుక్కలు అడవిలోకి వస్తున్నాయి. చిన్నచిన్న గొర్రె పిల్లలను కారిచి చంపుతున్నాయి. ఇంటి వద్ద ఉంటే పిల్లలను కరుస్తున్నాయి. ప్రభుత్వం, అధికారులు కుక్కల సమస్యను పరిష్కరించాలి.

- హన్మంతు, గొర్రెల కాపరి, హన్వాడ